


# సర్పశిల
## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**తక్షపురం**

"అయ్యా నేనొకసారి మా గురువుగారితో ఒక ఊరికి వెళ్ళాను. ఆ వూరిపేరు 'తక్షపురం'. ఏడెనిమిది వందల మందికి మించదు. ఆ వూరి జనాభా. ఆ వూరిలో ఓ గుడివుంది. నాలుగు రోడ్ల మధ్యగా ఉంది. ఆ గుడిని 'తక్షేశ్వరాలయమంటారట. ఆ పేరు ఎందుకొచ్చిందో తెలీదు. ప్రజలు చాలా సాధు స్వభావులు. చిత్రమేమంటే ఏ ఇంటికీ తాళాలుండవు. దొంగతనమే జరగదట. సరి.! అది గుడా అంటే గుడి. కాదా .. అంటే కాదు. నాలుగు స్థంభాలపైన ఓ చిన్న గోపురం. ఆ గోపురం నడినెత్తిన 'తోక మీద నుంచున్న మహా నాగశిల. ఇక నాలుగు స్థంభాల మధ్యన అటువంటిదే మరో మహా నాగశిల. చతురస్త్ర స్థంభాల నాలుగు వైపులా కూడా మధ్యనున్న మహా నాగశిలా రూపాలే చిన్నవిగా ఉన్నాయి. మొత్తం పద్దెనిమిది నాగులు. (నాలుగు స్తంబాల దిక్కులు X 4= 16+గోపురం మీద 1+ మధ్యన -1 మొత్తం = 18) వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించాను." ఆగాడు మట్టు.

"ఏమి తెలిసింది మట్టూ?" చెవులు రిక్కించి అడిగాడు శృంగి.

"చెప్పు.!" శ్రద్ధగా అన్నాడు రామజోగి.

"అయ్యా అది శిలలా లేదు. ఓ మహా సర్పం శాపవశాత్తూ శిలగా మారిందేమో అనిపించింది. ఆ నాగశిల కన్నులు.. ఓహ్. దాని నాల్కలు. ఓహ్ మహా భయాన్ని గొలుపుతోంది. ఎవరా యీ మహా శిల్పాన్ని చెక్కిన శిల్పి అనుకుంటూ ఆ శిలా సర్పాన్ని తాకటానికి ప్రయత్నించాను. అదేమి వింతో .. 'హుస్స'నే శబ్దం భయంకరంగా వినిపించింది. తాచుపాము బుస.. ఒక్క నాగు బుసకాదు. వెయ్యి నాగులు ఒకేసారి బుసకొట్టినట్టు. తటాలున చేతిని వెనక్కిలాక్కున్నాను. ఇది శిల అయితే ఆ బుసల శబ్దం ఎక్కడిదో? పోనీ గాలివల్ల కావొచ్చుననుకుని మళ్ళీ ఆ మహానాగాన్ని పరిశీలించాను. స్వామీ.. ఒకవేళ అది శిల్పమే అయితే ఆ శిల్పికి నాగరహస్యం తెలిసివుండాలి. నాగుల మధ్య ఉంటూ తెలిసి వుండాలి. నాగులమధ్య తింటూ నాగుల మధ్య నిద్రపోతూ నాగుల కదలికల్ని సంవత్సరాలపాటు గమనించి ఉండాలి. లేదా నాగుపాముల్ని ప్రాణాధికంగా ప్రేమించి ఉండాలి. లేకపోతే అంత సజీవంగా ఎలా మలచగలడు? అంతేకాదు.! ఆ కళ్ళల్లోని క్రూరత్వం? కాటు వేయడానికి సిద్ధంగా ఉన్న ఆ భంగిమ?" మళ్ళీ ఆగాడు మట్టు.

"ఆ గుడి పుట్టు పూర్వోత్తరాలేమీ తెలియలేదా?" అడిగాడు శృంగి. మట్టు రామజోగి వంక చూశాడు.

రామజోగి వీరాసనంలో కూర్చుని ఉన్నాడు. కళ్ళు మూసుకుని వున్నాయి. కనురెప్పల వంక చూశాడు. ఏ మాత్రం కదలికలు లేవు. కళ్ళు మూసుకున్నా కనుపాపల కదలికలు రెప్పలపైన కనిపిస్తాయి. అంటే రామజోగి ఓ గాఢ సమాధిలో ఉండి ఉండాలి. లేదా 'మనో నేత్రాలతో తక్షగ్రామాన్నీ, శిలా సర్పాన్నీ దర్శిస్తూ ఉండాలి. మధ్యలో ఆగకూడదు.

"తెలిసింది అతి కొంచెం.. శృంగీ, మనిషి జీవితమే ఓ విచిత్రం. ఎవడో ఏదో ఊరికొస్తాడు. తన ఊహకి తానే బందీయై.. ఆ ఊహే నిజం అనే భ్రాంతితో పడటమే గాక ఇతరుల్నీ నమ్మిస్తాడు. ఆ ఊరిలో ఒకడు నాతో, 'అయ్యా పరదేశీ ఇది సాక్షాత్తూ పరమశివుడు తక్షకుడ్ని అనుగ్రహించిన చోటు.. అందుకే యీ వూరి పేరు తక్షపురమనీ, యీ ఆలయం తక్షేశ్వరాలయమనీ ప్రశిద్ధి చెందాయి' అన్నాడు."

"అవును.! అలా అయివుండొచ్చు" వెంటనే అన్నాడు శృంగి.

"అలాగే అనుకుంటే అక్కడ ఈశ్వరుని లింగరూపముండాలిగా? మరి ఊరంతా వెదికినా లేదే. ఇదే మాట నేను అతనితో అంటే 'ఏమో మా వాళ్ళు అనుకునేది నీకు చెప్పాను గానీ నేనేమన్నా కొత్తగా కనిపెట్టానా?' అంటూ విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు" నవ్వాడు మట్టు.

"ఆ ప్రశ్న నాకు తోచలేదు సుమా" తనూ నవ్వాడు శృంగి. గత రెండు రోజుల పరిచయంతో వాళ్ళిద్దరికీ పరస్పరాభిమానం కలిగింది.

"ఇంకొకడంటాడూ, సర్పయాగం జరిగినప్పుడు ప్రాణభయంతో తక్షకుడు ఇంద్రుని సింహాసనాన్ని చుట్టుకున్నాడు. మంత్రమహిమతో తక్షకుడు ఇంద్రుని సింహాసనాన్ని చుట్టుకున్నాడు. మంత్ర మహిమతో తక్షకుడు ఇంద్రుడితోటీ ఇంద్రసింహాసంతోటీ సహ యజ్ఞ గుండలో పడబోయాడు. సరే యజ్ఞాన్ని జనమేజయుడు ఆపేశాడనుకోండీ.! అది ఆగుతుందని తెలియక ఇంద్రుడు తక్షకుడ్ని కాపాడటానికి శిలారూపాన్ని ప్రసాదించాడట. యాగం ఆగిపోయినా, ఆ శిలారూపం బాగా నచ్చి తక్షకుడు ఆ శిలలో ఉన్నాడని ఆ మనిషి చక్కని కథ అల్లాడు."

"ఈ కథ కాస్త వాస్తవానికి దగ్గరగా ఉందేమో మట్టూ. ఎందుకంటే 'తక్షకుడి' కథ ప్రాచుర్యంలోకి వచ్చిందే సర్పయాగ సమయంలో"

"అయ్యా శృంగీ.! శిలారూపం తక్షకుడికి నచ్చి ఉండొచ్చు. నచ్చాలంటే తనని తాను చూసుకోవాలి. శిల్పాన్ని మనం చూడగలంగానీ ఏ శిల్పమూ తనని తాను చూసుకోలేదు కదా, అలాంటప్పుడు తక్షకుడికి రూప భ్రాంతి కలగటానికి అవకాశమే లేదుగా. ఒకవేళ వున్నా. శిల్పం కూడా సర్పరూపం సజీవంగా ఉండాలనే కోరుకుంటాడు గానీ నిశ్చలమైన శిల్పంగా ఉండాలని కోరుకోడుగా" నవ్వాడు మట్టు.

"ఇంతకీ  యదార్ధమేమిటీ?" కొంచెం చిన్నబుచ్చుకుని అన్నాడు శృంగి.

"ఆ మహా నాగశిల అక్కడ వుండటం యదార్ధం. ఆ నాగుపేరు తక్షేశ్వరుడు కావటం నిజం. 'ఈశ్వరత్వం' సిద్దించినా సిద్దించకపోయినా ఆ శిలకీ తక్షకుడికీ ఏదో విడదీయరాని సంబంధం ఉన్నదన్నది యదార్ధం" ఆగాడు మట్టూ.

"మీ గురువుగారు ఏమన్నారూ?"

"మా గురువుగారిని 'సర్పశిల' విషయం అడగ్గానే, 'ఓ యీ మట్టూ.. తినబోతూ రుచులెందుకూ? యీ తక్షపురం యీనాటిది కాదు.  మహాభారతకాలం నాటిది. ఇంకా చెప్పాలంటే రామాయణకాలం నాటిది.  ఇది ఓ మహా

వినాశనానికి కేంద్రబిందువు. ఈ సర్పం తల కృతయుగంలో తూర్పుకి త్రేతాయుగంలో పడమరకీ, ద్వాపరయుగంలో ఉత్తరానికీ, కలియుగంలో దక్షిణానికీ తిరిగివుంటుంది. కాలాన్ని మింగేసే కాలనాగు యీ సర్పం. ఈ రోజు ఇక్కడికి మనం వచ్చాం. కారణం తెలుసునా? మొన్న రాత్రి కలలో యీ సర్పాన్ని దర్శించాను. నిన్నంతా నడుస్తూ నేటికి ఇక్కడికి చేరగలిగాం.! మళ్ళీ రావాలి. ఎప్పుడో ఎందుకో మాత్రం తెలీదు. కానీ రాకతప్పదు.! అన్నారు." వివరించాడు మట్టు. ఎక్కడో పట్టపగలే ఓ తీతువు పిట్ట హృదయ విదారకంగా అరిచింది.

"అవును మట్టూ అక్కడికి వెళ్ళక తప్పదు. నిట్టూర్చి అన్నాడు రామజోగి.

"అయ్యా.. తీతువు కూస్తే అశుభం అంటారు గదూ.!" అడిగాడు మట్టూ.

"భగవంతుని సృష్టిలో శుభాశుభాలు సమానమే మట్టూ. అంతేకాదు, తీతువు పిట్ట కూత ఓ సందేశం ఓ సూచన... ఓ ముందు పిలుపు.. ఆ కూతనిబట్టి కొన్ని లెక్కలు కుట్టవచ్చు.! సరే మధ్యాహ్నమైంది. భోజనం కానివ్వండి. ఇవాళ నేను భోజనం చెయ్యను" లేచి లోపలికి వెడుతూ అన్నాడు రామజోగి. మట్టూ శృంగీ అతనివంకే చూస్తుండిపోయారు. జరిగిన సంభాషణ అంతా మధుర వింటూనే ఉంది.

"ఏమయిందీ?" కంగారుగా అడిగాడు శ్రీనివాస్

"ఇప్పుడు టైమెంత?" నీరసంగా లేచికూర్చున్నాడు రాబీ.

"సాయంత్రం అయిదుగంటలు.. పొద్దు మీరీ 'ట్రాన్స్ లైన్ స్టేట్'లోనే వున్నారు. డాక్టర్ని పిలిపించాను. ఆయనా మిమ్మల్ని పరీక్ష చేసి కంగారు ఏమీలేదని చెప్పారు... అసలు మీకేమయిందీ?"

"ఐ డోంట్ నో.. మిస్టర్ విలియమ్స్ వచ్చాడు. నా మోకాలి చిప్పమీద అతని చెయ్యి పడింది. అంతే.. ఏవేవో దృశ్యాలు.. కొండలూ గుట్టలూ నదులూ సముద్రాలూ అన్నీ దాటుకుంటూ గాల్లో ఎగిరిపోతున్నాను. సడన్‌గా క్రిందనించి ఓ శక్తి నన్ను చాలా బలంగా ఆకర్షించింది. ఆ ఆకర్షణకిలోనై ఆకాశం నించి భూమివైపుకి దూసుకొస్తున్నాను. ఎవరో నన్ను మధ్యలోనే పట్టుకున్నారు" ఆగాడు రాబీ.

"ఎవరూ? ఎలా ఉన్నారూ?"

"చాలా పొడుగ్గా చాలా బలంగ ఉన్నాడు. ఆ మూకంలో అద్భుతమైన తేజస్సు.. అతను ఇండియనే. నన్ను కిందికిలాగే శక్తినించి దూరంగా తీసికెళ్ళాడు. ఓ మందిరంలో నన్ను కూర్చోబెట్టాడు. అక్కడ నా కళ్ళు మూతలు పడ్డాయి. కళ్ళు తెరిస్తే ఇప్పుడు నువ్వు ఎదురుగా వున్నావు" వివరించాడు రాబీ.

"చాలా చిత్రంగా వుంది మిస్టర్ రాబర్ట్... తరువాత విలియమ్స్ కనపడలేదా?"

"ఉమా.! కానీ అటు వెళ్ళకు.. వచ్చెయ్.' అన్న విలియమ్స్ మాటలు మాత్రం వినిపించాయి" సాలోచనగా అన్నాడు రాబీ.

"సరే. టాక్సీని పొద్దునే తిప్పి పంపించేశాను. ఇప్పుడు అయిదున్నర దాటింది గనక చుట్టుపక్కల ఊళ్ళని చూడలేము. కొండమీదకి వెళ్ళాలన్నా కష్టమే. అయితే హాయిగా గోవిందరాజస్వామి దర్శనం చేసుకోవచ్చు. తలకింద

'మానిక' పెట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ నిద్రించే స్వామిని చూస్తే నీరసం గీరసం నిముషంలో ఎగిరిపోతాయి. వెళ్దామా?" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాస్.

"దర్శనం సంగతి ఏమోగానీ, నీ మాటలు వింటేనే సగం నీరసం పోయింది పద.." నవ్వుతూ అన్నాడు రాబీ.

"పొద్దున్నించీ మీరేమీ తినలేదుగా!"

"నిజంగా ఆకలిలేదు. అన్నట్టు ఇప్పుడు జ్ఞాపకం వొస్తోంది. మందిరంలో నా కళ్ళు మూతబడ్డాయని చెప్పాను కదూ. అక్కడ నన్ను కూర్చోబెట్టిన వ్యక్తే నాకేదో తాగటానికి ఇచ్చాడు. అది తాగాకే కళ్ళు మూతలు పడ్డాయి."

"వాహ్... అటువంటి 'కలలు' నాకూ వస్తే ఎంత బాగుంటుందీ. తిండి, ఖర్చు మొత్తం సేవింగ్స్‌లో పడెయ్యొచ్చుకదా" నవ్వాడు శ్రీనివాస్.

టాక్సీని పిలవబోయాడు శ్రీనివాస్.

"వొద్దు.. నడుద్దాం." నడవటం మొదలెట్టారు. గోవిందరాజస్వామి ఆలయపు సందు తిరగ్గానే ఆ ప్రాంతమంతా బాగా తెలిసినట్టు గబగబా నడవడం మొదలెట్టాడు రాబీ.

"ఓహ్.. ఇదేమిటీ ఇన్ని షాపులు వున్నాయీ. నా చిన్నతనంలో ఇక్కడ మూడే షాపులు ఉండేవి. అబ్బ. ఎంత రష్, అప్పుడయితే ఇంతమంది వస్తారని కలలో కూడా ఊహించలా. మా నాన్న.." చెబుతూ సడన్‌గా ఆగి పోయాడు రాబీ. అప్పటిదాకా ఆశ్చర్యంగా అతను చెప్పేవి వింటున్న శ్రీనివాస్, "చెప్పండి రాబీ.. మీ నాన్న?" అన్నాడు.

"నాకేదో పిచ్చెక్కుతోంది శ్రీనివాస్. పుట్టాక మొదటిసారి ఇండియాకి వచ్చాను. తిరుపతి రావడమూ మొట్టమొదటిసారే. కానీ ఇదంతా నాకు తెలిసిన చోటులాగే వుంది. ఇక్కడే నా బాల్యంగడిచినట్టూ.. యీ గుళ్ళోనే ఆడుకున్నట్టూ అనిపిస్తోంది. ఏమౌతోంది నాకు" తల పట్టుకున్నాడు రాబీ.

"బహుశా మీవి పూర్వజన్మ స్మృతులు కావొచ్చు మిస్టర్ రాబీ. ఎందుకంటే గుడి సందు తిరగ్గానే మీరెలా నడిచారంటే బాగా పరిచయం వున్న చోటుకి ఎలా వెళతామో అలా నడిచారు. మీ గత జన్మల గురించి విలియమ్స్ చెబుతూ మీరు ఇండియన్ బ్రాహ్మిన్‌గా ఓ జన్మ ఎత్తారని చెప్పాడు గుర్తుందా? ఆ మాట గుర్తుండబట్టే నేను సైలెంట్‌గా మీ వెనకే మిమ్మల్ని అబ్జర్వ్ చేస్తూ వస్తున్నాను. లేకపోతే భయంతో బిగుసుకుపోయేవాడిని. ఎనీవే. లోపలికి పదండి. ఇంకేమైనా గుర్తుకొస్తుందేమో చూద్దాం." రాబీ భుజం తట్టి అన్నాడు శ్రీనివాస్.

"నేను ఈ భగవంతుడ్ని నమ్ముతాను" అన్న డిక్లరేషన్ పూర్తిచేశాక ఆలయంలోకి అనుమతించారు సెక్యూరిటీ వారు.

ఆలయ ప్రదక్షిణ చేస్తుంటే 'రాబీ'లో చెప్పలేని ఉద్వేగం. గోవిందరాజస్వామిని చూస్తూనే "తండ్రీ" అని తెలుగులో అరిచి నేలమీద వాలిపోయాడు రాబీ వెబ్‌స్టర్.

శ్రీనివాస్ మధ్యలోనే పట్టుకుని నేలమీద పడుకోబెట్టాడు. రాబీ వెబ్‌స్టర్ స్పృహలో లేడన్న విషయం వాలిపోతున్న పద్ధతిలోనే శ్రీనివాస్‌కి తెలిసింది.

నలుగురు సెక్యూరిటీ వాళ్ళు అతి కష్టం మీద రాబీని మోసి ఓ తోపుడు బండి మీదకి చేర్చగలిగారు.

ఆరడుగుల ఓ అమెరికన్‌ని తోపుడు బండిమీద తీసుకువెళ్ళడం ఓ 'వింత' అయింది ఆనాడు.

రాత్రంతా శ్రీనివాస్ మేల్కొనే వున్నాడు. తెల్లకి తెల్లవారుఝామున సడన్‌గా శ్రీనివాస్ భుజం మీద 'చల్లని' చెయ్యిపడింది.. ఉలిక్కిపడి తలతిప్పి చూస్తే "యస్. మిస్టర్ శ్రీనివాస్.. రాబీ చెప్పిన విలియమ్స్‌ని నేనే. గ్లాడ్ టూ మీట్ యూ.."

కోల్డ్ హేంజ్స్ ఎండ్ కోల్డ్ లుక్స్. శ్రీనివాస్ శరీరం మంచులా చల్లబడింది. గుండెమాత్రం రైలింజన్లా పరిగెడుతోంది.

షోలింగర్:

మద్రాసునించి కార్లో రెండు గంటల్లోగా చేరవచ్చు. తిరువళ్ళూరు మీదుగా వెళ్ళి 'తిరుత్తణి'లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామినీ స్వామి దేవేరులు శ్రీవల్లీ దేవసేన వార్లనీ దర్శించుకుని ఆ తరువాత షోలింగర్ వెళ్ళొచ్చు. ఆ వూరినే ఘటికాచలం అనికూడా అంటారు. మొదట లక్ష్మీ నృశింహస్వామి దర్శనం చేసుకున్నాక యోగాంజనేయ స్వామి దర్శనం చేసుకోవాలి. ఆంజనేయ స్వామిని నాలుగు హస్తాలతో సాలిగ్రామ మాలతో అభయ హస్తాలతో షోలింగర్'లో మాత్రమే చూడగలము. కారు కొండమీదకి చేరుకోగానే కుడివైపు నృశింహస్వామి గుడి కనిపిస్తుంది. 1400 మెట్లు. ఓ పక్కనించి చూస్తే ఆ కొండే 'సింహ' ముఖంగానూ, స్వామి వేంచేసిన గుడి సింహం వీపుగానూ కనిపిస్తుంది. కోతుల్ని లెక్కపెట్టలేదు. తలలో ఎవరుపువ్వులు పెట్టుకున్నా కోతులు మీదకి దూకి పువ్వుల్ని కిందపడేస్తై. అందుకే కొండ ఎక్కి దర్శించుకునేవారు పువ్వులు పెట్టుకోరు. పువ్వులన్నీ భగవంతుడికే చెందాలని ఆ కోతులు భావిస్తాయేమో మరి. అందుకే కొబ్బరికాయలూ పళ్ళూ పూలతోపాటు కోటుల్ని అదిలించడానికి ఓ కర్రనికూడా దుకాణదారులు ఇస్తారు.

మెట్లు ఎక్కలేని వాళ్ళని పైకి తీసుకెళ్ళడానికి 'డోలీలు' కూడా దొరుకుతై. రాత్రిళ్ళు ఎవరూ నృశింహ కొండమీదగానీ ఆంజనేయస్వామి కొండమీదగానీ బసచెయ్యరు. చెయ్యలేరు కూడా. రెండిటికీ మధ్యనున్న చోటనే సత్రాలు ఉన్నై. ఇప్పుడు ఓ మాదిరి ఏసి హోటళ్ళు ఉన్నై.

'షోలింగర్'లో నిద్రచెయ్యడం వల్ల అనేకానేక 'పీడలు' తొలిగి పోతాయంటారు. ముఖ్యంగా 'గాలి' పట్టినవాళ్ళూ, మానసిక రోగులూ అక్కడ మూడు నిద్రలు చేస్తే ఆరోగ్యం కుదుటపడుతుందంటారు.

అలా కుదుటపడ్డ వాళ్ళ సంఖ్యకి లెక్కలేదు. ఎవర్ని కదిపినా వారివారి అనుభవాన్ని వివరిస్తారు. మననీ 'నిద్ర' చేసి చూడమంటారు.

జయదేవ్ సుదర్శన భట్టుతో షోలింగర్‌లోని నృశింహ కొండ మెట్లమీద కూర్చుని వున్నాడు.

"సుదర్శన్ జరిగిందేమిటో స్పష్టంగా నాకు తెలీదు. శ్రీనివాస్ చాలా అయోమయమైన స్టేట్‌లో వున్నాడు. అతను మాట్లాడే మాటలకి పొంతన లేదు. ఇక రాబీ విషయం ఏమాత్రం అర్థం కావటంలా. గోవింద రాజస్వామి గుడిలో పడిపోయిన వాడు ఇప్పటిదాకా అంటే పదహారు గంటలు గడిచినా స్పృహలోకి రాలేదు. హోటల్ వాళ్ళు ఫోన్ చేయబట్టి రాత్రికి రాత్రి బయలుదేరి రాగలిగాను. నువ్వు ఇక్కడుంటావని తెలుసు. నువ్వు తప్ప ప్రస్తుతం మరెవరూ సహాయం చేసే స్థితిలో వుండరనీ తెలుసు. నువ్వు తప్ప ప్రస్తుతం మరెవరూ సహాయం చేసే స్థితిలో వుండరనీ తెలుసు. మయూరాలో నా వైఫ్‌నీ బావమరిదినీ వాళ్ళకి తోడుగా వుంచి వచ్చాను. బయటకు ఏ మాత్రం పొక్కినా పెద్ద నాన్సెన్స్‌గా తయారవుతుంది. ఛానల్స్ చేసే హడావిడి తెలుసుగా" వివరించాడు జయదేవ్.

"నీ ఇష్టం వచ్చిన పువ్వు పేరు చెప్పు." చిన్న సంచిలోంచి 'గవ్వలు' తీసి అన్నాడు సుదర్శన్.

"కలువ"

"నీ ఇష్టం వచ్చిన రంగూ?"

"నీలం"

యీ క్షణంలో ఏ దేముడు నీ మనసులో వున్నాడు?"

"ఆంజనేయుడు."

"బస్‌న" కళ్ళు మూసుకుని గవ్వల్ని విసిరాడు సుదర్శన్. మొత్తం తొమ్మిది గవ్వలు. నాలుగు వెల్లకిలా పడ్డాయి. అయిదు బోర్లా పడ్డాయి. వాటిలో వెల్లకిలా పడ్డ వాటిని మళ్ళీ చేతిలోకి తీసుకుని "ఇప్పుడు చెప్పు. నీకు తెలిసిన ఓ పిట్టపేరు."

"తీతువు" అప్రయత్నంగా అన్నాడు జయదేవ్. ఒక్కసారి కళ్ళు మూసుకుని గవ్వలు విసిరాడు సుదర్శన్. నాలుగూ వెల్లకిలా పడి అటూ ఇటూ ఊగి విచిత్రంగా బోర్లా పడ్డాయి. కళ్ళు పెద్దవి చేసి వాటివంకే చూస్తూ అన్నాడు సుదర్శన్. "ఆత్మ..! ఓ ఆత్మ వాళ్ళని తన గుప్పెట్లోకి తీసుకుంది"

"ఆత్మా? ఔను. రాబర్ట్ నిన్న నాతో మిస్టర్ విలియమ్స్ అన్న ఆత్మ గురించి చెప్పాడు" రాబీ చెప్పింది చెప్పటమేకాక కారు డ్రైవర్ ఏడుమలైని విలియమ్స్ రూపం ఎలా పోలివుందో కూడా చెప్పాడు.

"యస్.. అటువంటిదే సరే అక్కడికే పోయి చూద్దాం పద" మెల్లగా లేచాడు సుదర్శన్.

"కానీ" సందేహించాడు జయదేవ్.

"నీ సందేహం నాకు తెలుసు జయ్. వాళ్ళని ఇక్కడికి ఎలాగొలా తీసుకురావొచ్చు. కానీ ప్రస్తుతం ఉపయోగం వుండదు. వాటెవర్, ముందు తిరుపతికి వెళ్ళి తరవాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" జయ్ భుజాన్ని స్నేహంగా తట్టి అన్నాడు సుదర్శన్.

"నీ గవ్వలు ఏం చెప్పాయి సుదర్శనా?" నవ్వుతూ అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"వీరిద్దరినీ ఓ ఆత్మ తన గుప్పెట్లోకి తీసుకుందని చెప్పాయి. అయినా ఆ విషయం మీకెలా తెలుసూ?" ఆశ్చర్యంగా అన్నాడు సుదర్శన్.

"వారి పేరు పరమేశ్వర శాస్త్రిగారు. వారిని చూడటమే మన పూర్వజన్మ సుకృతం. శాస్త్రిగారు చండీ ఉపాసకులు. నా చిన్నతనం నించీ వారు ఇలాగే వున్నారు గనక వారి వయసెంతో చెప్పడం నావల్ల కాదు. ఇక నీ సంగతీ నీ గవ్వల సంగతీ వారికెలా తెలుసో వారే చెప్పాలి" పరిచయం చేశాడు జయదేవ్. సుదర్శన్ వొంగి పరమేశ్వర శాస్త్రి పాదాలు సృజించాడు.

"శుభమస్తు" అని దీవించారు శాస్త్రిగారు.

ప్రస్తుతం వీరందరూ సమావేశమైంది తిరుపతికి ఓ రెండు కిలోమీటర్ల దూరంలో వున్న ఓ గెస్ట్ హౌస్‌లో. ఆ గెస్ట్ హౌస్ ఓ వ్యాపారవేత్తది. ఆ వ్యాపారవేత్త జయదేవ్‌కి స్నేహితుడేకాక చాలా సిన్సియర్.

"నాయనా సుదర్శనా మీ తండ్రిగారైన గంగాధర భట్టుగారితో నిన్ను నీ చిన్నప్పుడు చూశాను. మీ తాత ముత్తాతలు బెంగాలీవారు. మీ నాన్నగారు కర్ణాటకలో స్థిరపడటమే కాక మీ తాత ముత్తాతల విద్యని నీకు నేర్పారు. మీ ముత్తాత యీ గవ్వలు విసరడం ద్వారా అద్భుతంగా భవిష్యత్తుని చెప్పగలిగేవారు. అసలు మీ ఇంటిపేరు 'సెన్'. మీ నాన్నగారిని చంద్రమౌళీశ్వర భట్టుగారు దత్తత తీసుకోవడంతో ప్రస్తుతం మీ ఇంటిపేరు 'భట్' అయింది. జయ్ ఇక్కడ్నించి షోలింగర్ వెళ్ళాడని తెలియగానే నిన్ను కలవడానికే వెళ్ళి వుంటాడనుకున్నాను. కలిశాక నువ్వు నీ గవ్వలతో భవిష్య నిర్ణయం చెయ్యక మానవుకదా" నవ్వారు శాస్త్రిగారు.

"ప్రస్తుత పరిస్థితి ఏమిటి శాస్త్రిగారూ?" అడిగాడు జయదేవ్.

"కంగారు పడవలసిన పనిలేదు జయదేవా, వీరిని 'పట్టు'కున్న ఆత్మ మామూలుది కాదు. వీరిని తన పనికి ఉపయోగించుకుంటుందేమోగానీ అపకారం మాత్రం చెయ్యదు. యీ కుర్రాడు శ్రీనివాస్ భయపడ్డాడు. అందువల్ల ఇతని మాటలకి పొందిక లేదు. ఇక ఆ 'తెల్ల' కుర్రాడయితే గతానికీ వర్తమానానికీ మధ్య ఊగులాడుతున్నాడు. మామూలు స్థితికి రావడానికి కొన్ని గంటలు పట్టొచ్చు లేదా కొన్ని రోజులూ పట్టొచ్చు. సరే ఎన్ని గవ్వలు వేశావయ్యా సుదర్శనా?" సుదర్శన్ వంక తిరిగి అన్నాడు శాస్త్రిగారు.

"తొమ్మిది గవ్వలు వేశానండీ.. నాలుగైదు వెల్లకిలా పడ్డాయి. మరోసారి వేస్తే వెల్లకిలా పడి, అటూ ఇటూ వూగి మళ్ళీ బోర్లా పడ్డాయి."

"ఓహో... ఇప్పుడోసారి మళ్ళీ వెయ్యి. యీసారి ఏడుగవ్వలు చాలు. ఇదిగో నేనో చతురస్రాన్ని గీస్తాను. అందులో పడేలా వెయ్యి."

సుద్దముక్కతో ఓ చతురస్రాన్ని గీసి దిక్కులనీ మూలలనీ మార్క్ చేశారు శాస్త్రిగారు.

మూడు గవ్వలు గుండ్రంగా తిరుగుతూ దక్షిణం వైపుకొచ్చి బోర్లాపడితే నాలుగు గవ్వలు నాలుగు మూలలవైపుకే చెదిరిపోయాయి.

శాస్త్రిగారు చాలాసేపు మౌనంగా వాటి వంకే చూస్తూ కూర్చున్నారు. మొహంలో కొంత ఆందోళన కనపడుతోంది. ఓ పదినిముషాల తరవాత,

"ఊ.. నీ గవ్వలు ఏం చెబుతున్నాయో ఇప్పుడు చెప్పు" అన్నారు.

"అయ్యా. నాలుగు దిక్కులా ముప్పు పొంచివున్నది. ప్రధానంగా దక్షిణం వైపునించే ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ ప్రమాదం మానవాతీతమైనది. నాకు తెలిసింది అంతే" చెప్పాడు సుదర్శన్.

"సరే మనం ఎటువైపుకి వెళ్ళాలో మళ్ళీ గవ్వలు వేసి నిర్ధారించు. యీసారి నాలుగు గవ్వలు చాలు."

మళ్ళీ సుదర్శన్ గవ్వలు వేశాడు. మూడు దక్షిణం వైపుకి జరిగి వెల్లకిలా పడితే ఒక్కటి మాత్రం ఉత్తరం వైపుకి దొర్లుతూ వెళ్ళిపోయింది. కనీసం మూడు గజాలు దొర్లి బోర్లాపడింది.

"ఊ.! మీరిద్దరూ అలిసివున్నారు. కాస్త విశ్రాంతి తీసుకోండి. జయదేవా, నీ భార్యనీ బావమరిదినీ మద్రాసుకి పంపించెయ్. కొన్నాళ్ళపాటు నువ్వూ యీ సుదర్శనుడూ నాతో ఉండాల్సి వస్తుంది. వీలవుతుందా? ఫరవాలేదా?" అడిగారు శాస్త్రిగారు.

"మీతో కొన్నిరోజులు గడపగలడం నా భాగ్యం అనుకుంటాను" ఆనందంగా అన్నాడు జయదేవ్.

"నేనూ అంతే శాస్త్రిగారు అయితే ఒక్క రిక్వస్టు నా తాత ముత్తాతల గురించి మీకు వీలున్నప్పుడు నాతో చెప్పాలి. ఎందుకంటే వారి గురించి బొత్తిగా నాకేమీ తెలీదు" చేతులు జోడించాడు సుదర్శన్.

"అలాగే నాయనా తప్పక చెబుతాను. యీ గవ్వలు విసిరి భవిష్యత్తుని తెలుసుకునే విద్య ప్రస్తుతం నీ దగ్గరా మరో ముగ్గురి దగ్గర మాత్రమే వున్నది. ఆ మిగతా ముగ్గురూ కలకత్తా సబర్బ్‌లో ఉన్న షియాల్దాలో ఉంటున్నారు. వారు ముగ్గురూ అన్నదమ్ములు. ముగ్గురూ ఎనభై సంవత్సరాలు దాటిన వారే. ఇంకా చెబితే విద్యలోనూ బంధుత్వంలోనూ వారి వారసుడివే నువ్వు. ఆ ముగ్గురికీ నువ్వు మనవడివి అవుతావు. నీ పదో యేటే నీ తండ్రి గతించి వుండకపోతే వారిని ఎప్పుడో కలుసుకునేవాడివి. సరే.. సమయం ఇప్పుడొచ్చింది. ఈ విద్య చాలా పురాతనమైంది. ఒకప్పుడు కూడికలూ తీసివేతలూ గుణకారాలూ భాగాహారాలూ కూడా యీ గవ్వలు తోటే చేసేవారని నీకు తెలుసా? సరే ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకోండి. మిగతావి తరవాత మాట్లాడదాం" లేచారు శాస్త్రిగారు.

వొణికిపోతూ లేచింది మధుర. కొంచెం దూరంగా వున్న నవారు మంచం మీద రామజోగి నిద్రపోతున్నాడు. అరుగులమీద శృంగీ మట్టు నిద్రిస్తున్నారు. సవ్వడికాకుండా బిందెలోనించి కంచుగ్లాసులో నీరు తీసుకుని తాగింది. ఎంత భయంకరమైన కల.! ఓహ్.. భయంతో మధుర వెన్ను మళ్ళీ వొణికింది.

"నిద్రపట్టడంలేదా మధురా" కళ్ళు తెరిచి అన్నాడు రామజోగి. రామజోగిని హత్తుకుపోయింది మధుర. వెక్కివెక్కి ఏడుస్తూ, "ఎవరో ఎవరో పిల్లవాడు.."

"ఉహూ! ఏడవకు. ఏమీ మాట్లాడకు. ప్రశాంతంగా వుండే ప్రయత్నం చెయ్యి. సరేనా?" మధుర వీపు నిమురుతూ స్వాంతనపరిచే ప్రయత్నం చేశాడు రామజోగి. కానీ అతని కళ్ళల్లో ఓ మెరుపు. చీకట్లను ఛేదించే విద్యుల్లతలాంటి వెలుగు.. ఎక్కడో ఓ పిడుగు తటాల్న పడింది. కుంభవృష్టి మొదలైంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments